ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025



ఎరువులు అందక రైతుల ఆందోళన

కురుపాం : ఎరువులు అందక కురుపాంలో రైతులకు ఆందోళన చేశారు. స్థానిక మన గ్రోమోర్కు సుమారు 260 బస్తాలు గురువారం సాయంత్రం వచ్చినప్పటికీ శుక్రవారం ఉదయానికి అయిపోవడంతో షాపు మూసి వేశారు. దీంతో షాపు ముందు రైతులు ఆందోళన చేశారు. శుక్రవారం రాత్రి మన గ్రోయోర్ తలుపులు తెరవడంతో మేనేజర్ రమేష్‌ను రైతులు నిలదీశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మా షాపులో ప్రతి రోజు కొన్న రైతులకే అమ్మకాలు చేపట్టామని మళ్లీ వస్తే ఇవ్వలేని రైతులకు అందజేస్తామన్నారు.



ఎరువుల దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అరచేతిలో వైకుంఠంలా పేదరిక నిర్మూలన

- అధికారుల మెడకు పి-4 గుదిబండ
- మార్గదర్శుల(దాత) కోసం అన్వేషణ
- ముందుకెవరూ రాకపోతే అధికారులకే బాధ్యత



ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదరిక నిర్మూలన కోసం తెరపైకి తీసుకొచ్చిన సరికొత్త ఆలోచన పి-4 విధానం. పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్టిసిపేషన్‌తో కొనసాగే విధానమని సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈ విధానంలో భాగంగా నిరుపేదలను ధనవంతులు చేయడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని రూపకల్పన చేశారు. ప్రభుత్వం ఆలోచన వరకు ఈ విధానం బాగానే కనిపిస్తోంది. కానీ ఆచరణలో అమలు చేయడం అధికారులకు కత్తి మీద సాములా తయారైంది. వారి మెడకు ఇది గుదిబండలా పరిణమించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విధానంలో నిరుపేద కుటుంబాలను సచివాలయం స్థాయిలో ఎంపిక చేశారు. వారినే ప్రభుత్వం బంగారు కుటుంబాలుగా పరిగణిస్తోంది. ఇక వీరిని ధనవంతులుగా మార్చేందుకు సహాయం చేసే దాతలను మార్గదర్శులుగా పిలవాలని సూచించింది. బంగారు కుటుంబాలను ఎంపిక చేయడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. గ్యాస్ వాడకం లేని విద్యుత్ అతితక్కువ వినియోగం చేసే కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయాలని నిర్దేశించింది. ఇంట్లో ఎవరూ ఆదాయపన్ను చెల్లించని, నాలుగు చక్రాల వాహనాలు వుండని కుటుంబాలు కూడా ఈ పరిగణనలోకి తీసుకోవచ్చునని సూచించింది. బంగారు కుటుంబాల ఎంపికలో ఉద్యోగులు మొదట్లో కొంత తొందరపాటు కనబరిచినా క్రమేణా వడపోత కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాల పేర్లను ప్రకటించిన తర్వాత అభ్యంతరాలు లేని వారిని ఎంపిక చేశారు. ఇంతవరకు బాగానే జరిగింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన జిల్లాలో 33,309 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారు. వీరిని అత్యంత నిరుపేద కుటుంబాలుగా ప్రభుత్వం భావిస్తోంది. వీరిని ధనవంతులు చేసే బాధ్యతలను దాతలైన మార్గదర్శకులకు అప్పగించాలని, అనుసంధానం చేయాలని ప్రభుత్వం చెపుతోంది. ఇంతవరకు 13వేల బంగారు కుటుంబాలతో మార్గదర్శకులను అధికారులు అనుసంధానం చేశారు. ఇంకా 20వేలకు పైగా బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల అవసరం ఉంది. వీరి కోసం అన్వేషణలో అధికారులు తలమునకలై ఉన్నారు.

అధికారుల్లో ఆందోళన

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గడచిన ఏడాది కాలంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులు పెద్దగా చెప్పుకోవడానికి ఏమీ లేవు. దీర్ఘకాలంగా అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో గ్రామీణ,పట్టణ రహదారులు గుంతలతో నిండి వున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులుగా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. కానీ వచ్చే సంక్రాంతికి కూడా గుంతలు లేని రహదారులు కనిపించే అవకాశం లేదు. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బిజీగా ఉన్న అధికారులకు పి-4 విధానం గుదిబండ గా మారుతోంది. నిరుపేద కుటుంబాలకు అనుసంధానం చేయడానికి దాతలు దొరకని పక్షంలో అధికారులు, ఉద్యోగులే వారిని దత్తత తీసుకోవాలనే వాదన తెరపైకి వస్తోంది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా ధనవంతులు ఉండొచ్చు. కానీ ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే ఆలోచన, ఆశయం అందరికీ వుండకపోవచ్చు. పేదలకు సాయం చేయాలనే ఆలోచనతో ఎవరైనా ముందుకు రావొచ్చు కానీ బలవంతంగా వారిని ఈ విధానంలోకి లాగే ప్రయత్నం జరుగుతుందేమోనన్న ఆందోళన వెంటాడుతోంది. ప్రయివేటు దాతలు ముందుకు రాని పక్షంలో అధికారులు, ఉద్యోగులే బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే పరిస్థితి కనిపిస్తోంది.

ఏజెన్సీలో నిజమైన బంగారు కుటుంబాలు

స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటినా ఏజెన్సీలో గిరిజనుల జీవన ప్రమాణాలు, ఆహారపుటలవాట్లు దయనీయమైన స్థితిలో ఈనాటికీ ఉన్నాయి. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల పేదరికం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వాలెన్ని మారినా వారి జీవన విధానంలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. వారికి విద్య, వైద్యం ఇప్పటికీ అందని ద్రాక్ష లాగే వున్నాయి. రహదారి సౌకర్యం లేక డోలీమోతల్లో రోగులను మైదాన ప్రాంతానికి తీసుకొచ్చే పరిస్థితి ఈ గ్రామాల్లో వుంది. ఇలాంటి ప్రజలను ధనవంతులుగా చేయాలంటే వారికి ఏదో కొంత ఆర్థిక సహాయం చేస్తే వారు ధనవంతులుగా మారుతారనే ఆలోచన సరైనది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వారి జీవనానికి అవసరమైన రహదారులు, విద్య, వైద్యం, విద్యుత్ సరఫరా, రక్షిత మంచినీటి సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అంతేకానీ పి4 కార్యక్రమంలో భాగంగా దాతలచేత నెలనెలా నగదు సాయం చేస్తే వారిలో పేదరిక నిర్మాలన అవుతుందనుకోవడం అత్యాశే.

పి4 వెనుక ప్రభుత్వ వ్యూహం

పేదరిక నిర్మాలన కోసం పి4 విధానం తీసుకురావడం వెనుక ప్రభుత్వ వ్యూహం వుండొచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజమైన పేదలను ఎంపిక చేసిన తర్వాత వారికే సంక్షేమ పథకాలు అమలు చేయాలనే నిర్ణయానికి రావొచ్చుననే వాదనలు తెరపైకి వస్తున్నాయి. రాష్ట్రంలో పేదరికానికి ప్రధాన అర్హత తెలుపు రేషన్ కార్డు వుండడమే. తెలుపు రేషన్ కార్డులు ఉన్న వారంతా నిజమైన పేదలు కారనే భావంలోకి పి4 విధానం తీసుకెళ్లే అవకాశం ఉంది. నిరుపేదలకే సంక్షేమ పథకాలు అందాలనే ఆలోచనతో ప్రభుత్వం పి4 విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామసభల ద్వారా నిరుపేద కుటుంబాలను ఎంపిక చేయడమంటే ప్రజల ఆమోదంతోనే ఎంపికైన వారంతా నిజమైన పేదలని స్పష్టమవుతోంది. తెలుపు రేషన్ కార్డులు కలిగిన వారిలో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలమంది సంక్షేమ పథకాలు పొందుతున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ఏటా వందల కోట్లు మిగులు కనిపించే అవకాశం ఉంది. ఏమైనా పి4 విధానం తీసుకురావడం వెనుక నిగూఢ రహస్య వ్యూహం వుండొచ్చు నసే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

కొటియా సరిహద్దు సమస్య పరిష్కరించాలి

మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - సాలూరురూరల్

కొటియా సరిహద్దు గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కొటియా సరిహద్దు గ్రామాల సమస్య పరిష్కరించకపోవడం సరికాదన్నారు. కొట్టియా గ్రామాలపై ఒడిశా ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుందన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములపైనా, మన రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపైనా, అంగన్‌వాడీ కేంద్రాలపైనా దాడులు చేస్తూ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులకు రక్షణగా ఉండాల్సిన మన రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదని, శాశ్వత పరిష్కారానికి ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుటమి ప్రభుత్వం, ఒడిశాలో బిజెపి, కేంద్రలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారానికి సానుకూల వాతావరణం ఉందని, అయినా ప్రభుత్వాలు చొరవ చూపడం లేదని విమర్శించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి కొటియా గ్రామాల సమస్యను పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి, గిరిజనులకు రక్షణగా ఉండాలని కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ రెండు ప్రభుత్వాలు మధ్య కోటియా సరిహద్దు గ్రామాల గిరిజనులు నలిగిపోతున్నారని, ఈ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఒడిశా ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓట్లు వేయకుండా స్థానిక గిరిజనులను ఇబ్బంది పెట్టిందన్నారు. అంగన్వాడీ భవనాలను నేలమట్టం చేయించారని, గిరిజనులపై ఒడిశా అధికారులు దౌర్జన్యం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకుండా మౌనంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా కొఠియా సరిహద్దు గ్రామాల వివాదం పరిష్కారం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయ అధికారికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తాడంగి సన్నం, కొంబులు, చరణ్, కూనేటి సుబ్బారావు, ముసిరి చింత, జోగయ్య, మర్రి మసి తదితరులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌పి మాధవరెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ఎస్‌పి శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గ్రీవెన్స్-డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారి సమస్యలను ఎస్పీకి వివరించారు. సిబ్బంది తెలిపిన సమస్యలను ఎస్పీ పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డిపివో) సంబంధిత ఫిర్యాదులపై అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, పరిష్కారంకు అవకాశం వున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

వట్టిగెడ్డ రిజర్వాయర్‌పై నిర్లక్ష్యం

వెంటాడుతున్న సిబ్బంది కొరత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం రావాడ గ్రామ సమీపాన వట్టిగెడ్డ రిజర్వాయర్ నిర్మించి 48ఏళ్లు అయింది. అప్పటి శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం మండలంగా ఉన్న కాలంలో 1977లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆరుగురు ముఖ్యమంత్రి (శ్రీకాకుళం జిల్లా రాజాం నివాసులు) జలగం వెంగళరావు ఒట్టిగెడ్డ జలాశయాన్నిప్రారంభించారు. ఈ ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నాగావళి నదికి ఉపనది. జియమ్మవలస, కురుపాం మండలాల్లో 38 గ్రామాలను కలుపుకుంటూ 16,684 ఎకరాల భూమికి సాగునీటి సదుపాయం కల్పిస్తోంది. ఖరీఫ్, వేసవి పంటలను ఒట్టిగెడ్డ నీటిపై ఆధారపడి రైతులు పండిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రిజర్వాయర్ అభివృద్ధి జాడలు అంతంతా మాత్రం గానే ఉన్నాయి.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

జియమ్మవలస మండలంలోని ప్రధాన సాగు నీటి వనరైన ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌కు గత కొంతకాలంగా సిబ్బంది లేమి వెంటాడుతుంది. ఈ ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువ ద్వారా 13,324 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 3360 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎడమ కాలువ మూడు బ్రాంచ్‌లతోనూ, కుడి కాలువ ఐదు బ్రాంచ్‌లతోనూ సుమారు 17 కిలోమీటర్లు మేర పూడికతీత, జంగిల్ క్లీనింగ్ మొదలైన నిర్వహణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదంతా సిబ్బంది లేకపోవడంతో దారి పొడుగునా కాలువలకు గండ్లు పడడంతో చివరి భూములకు సాగునీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా 13 మంది సిబ్బంది ఉండాల్సిన ఈ ప్రాజెక్టు పరిధిలో కేవలం ఒక మెన్ మజ్దూర్, హెడ్ మజ్దూర్ పనిచేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ పని చేస్తున్న ఎఇ జివి రఘు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మొండెఖల్ ఇరిగేషన్ అధికారి శంకరరావు ఇక్కడ ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలను చేపడుతున్నారు.



పూడికతీత, జంగిల్ క్లీనింగ్ లేని కాలువలు



వట్టిగెడ్డ జలాశయం

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. చుట్టూ పచ్చని చెట్లతో ఉన్న ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. పండగ సందర్భాల్లో ఒట్టిగెడ్డ జలాశయం చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.

కాలువలు అభివద్ధి చేసి సాగు నీరు అందించాలి

ఒట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువలు అభివృద్ధి చేసి పంట పొలాలకు సాగు నీరందించాలి. గత కొంత కాలంగా కాలువలకు గండ్లుపడడంతో సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించాలి.

కె. సీతారాం ,
సిపిఎం మండల కార్యదర్శి.

వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం


సమస్యలపై నిలదీత

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ సాధారణ సమావేశం శుక్రవారం స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న డంపింగ్ యార్డ్ బత్తినివాని చెరువు దగ్గర చెత్త వేయొద్దని ఇరిగేషన్ అధికారులు తమకు లేఖ పంపించారని కమిషనర్ రత్నం రాజు చెప్పగా కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, గంట సంతోష్‌కుమార్, దుప్పాడ పాపినాయుడు తదితరులు దీనిపై ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా 20 కుళాయి కనెక్షన్లు మంజూరుకు ఎజెండాలో పెట్టగా దీన్ని నాలుగో వార్డ్ కౌన్సిలర్ గంగునాయుడు ప్రశ్నించారు. సక్రమంగా నీరే సరఫరా చేయకపోతే ఇంకా అదనంగా కొళాయి కనెక్షన్లు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా భవనాల అనుమతులకు సోడా ఆమోదం ఎలా ఇస్తున్నారో కూడా తమకు తెలియటం లేదని కౌన్సిలర్లు మండిపడ్డారు. వెంకటరాయిని కోనేరు, చేపల చెరువు లీజు విషయంలో కౌన్సిలర్లు అడ్డగించారు. తక్కువ పాటకు ఇవ్వొద్దని కౌన్సిలర్లు నిలదీశారు. వడములో శివాలయం నిర్మాణానికి తామంతా తీర్మానం చేసినప్పటికీ ఎందుకు అడ్డగిస్తున్నారని నిలదీశారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ తదితరులు ఉన్నారు.

చెరువు పాడైపోయిన ఫర్వాలేదట

పట్టణ నడిబొడ్డున గల వెంకటరాయిని కోనేరు పూర్తిగా పాడైపోవడంతో పట్టణ వాసులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. సమావేశంలో ఈ అంశం చర్చ ప్రవేశ పెట్టగా దీనిపై కౌన్సిలర్లు అడ్డుతగిలారు. చెరువు పోయినా పర్వాలేదు తక్కువ వేలంపాటకు ఇవ్వొద్దంటూ పట్టుబట్టారు. మత్స్యకారులకు ఇవ్వకుండా సుమారు ఏడాది కాలయాపం చేశారు. దీంతో చెరువు పూర్తిగా చెత్తాతో నిండిపోయి, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నగర పంచాయతీ పాలకవర్గం మాత్రం భీష్మించుకొని చెరువు లీజుకు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కుమారి



జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భామిని : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణరావు డిమాండ్ చేశారు. భామినిలో శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భామిని మండల మధ్యాహ్న భోజన కార్మికుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షులుగా పద్మమ్మ, ఉపాధ్యక్షులుగా పి.రాజేశ్వరి, కార్యదర్శిగా గౌరమ్మ, సభ్యులుగా భారతమ్మ, జయమ్మ, లక్ష్మీ, ఇందిరమ్మ, సూర్య కుమారి ఎన్నుకున్నారు. ఆగస్టు 3న జరుగు మధ్యాహ్నం భోజన కార్మికుల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కె.మిన్నరావు పిలుపునిచ్చారు.

పటిష్టంగా అసంక్రమిత వ్యాధుల సర్వే

ప్రజాశక్తి - పార్వతీపురం

జీవనశైలి వ్యాధులైన అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి, ప్రభావం అంచనా, నియంత్రణకు వైద్యారోగ్యశాఖ మరింత పటిష్టంగా చర్యలు చేపట్టనుందని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. ఇందుకు సంబంధించి మూడు రోజుల పాటు మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎన్‌సిడి వర్క్ షాప్‌కు జిల్లా నుంచి ఎన్సీడి వైద్య బృందం హాజరైంది. శుక్రవారం తో ముగిసిన వర్క్ షాప్ ముఖ్యోద్దేశ్యాన్ని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు కొనసాగిన ఎన్సీడీ3.0 సర్వే ద్వారా రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వ్యాధుల వ్యాప్తి ప్రభావం అంచనా వేయడం జరిగిందని, ఈ నివేదికలను అనుసరించి అసంక్రమిక వ్యాధుల వ్యాప్తిని ముఖ్యంగా కేన్సర్ ప్రభావం మరింత లోతుగా అధ్యయనం చేసి తద్వారా నియంత్రణ చర్యలు బలోపేతం చేసే దిశగా ఎన్సీడి 4.0 సర్వే చేపట్టనున్నారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన అసంక్రమిక వ్యాధుల బారిన పడి, ముఖ్యంగా కేన్సర్ ప్రభావం ఆందోళన కలిగించే దిశగా ఉన్నాయని, వీటి నియంత్రించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కర్నీ స్క్రీనింగ్ చేసి వ్యాధి లక్షణాలు సత్వరంగా గుర్తించడం, చికిత్స, పర్యవేక్షణతో ఎన్‌ఎఫ్.హెచ్ఎస్ లక్ష్యాలను చేరేందుకు ప్రధాన ధ్యేయంగా ఎన్సీడి4.0 సర్వే కు వైద్యారోగ్యశాఖ ప్రణాళిక సిద్ధం చేయనున్నారని తెలిపారు. జిల్లాల వారీగా ఎన్సీడి సర్వే జరిగిన తీరు, సవరించాల్సిన అంశాలపై సమీక్షించారని అన్నారు. అదే విధంగా ఎన్‌సిడి పరిధిలో ఉన్న పలు ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధులపై వివరించారన్నారు. సరైన జీవనశైలి, ఆహారనియమావళిపై క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ కె.సూర్య కౌశిక్, ఎన్‌సిడి కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సునీల్ కుమార్, ఎఫ్‌ఎల్‌సి ఎస్.సాయిరమణి, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కృష్ణారావు హాజరయ్యారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమయపాలన పాటించకుంటే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాల్సిన వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటన నేపథ్యంలో కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె ఆసుపత్రిలో ఉన్న పలు రికార్డులను, హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావుకు ఫోన్లో మాట్లాడి ఆసుపత్రిలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో కీలకంగా వ్యవహరించాల్సిన వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం సరికాదన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు తాకిడి ఎక్కువగా ఉంటుందని, కావున రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కెఆర్‌బి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవని వైద్యులు, సిబ్బంది ప్రజల ఆరోగ్య స్థితిగతులపై పట్టించుకోవడంలేదని తుమ్మలవలస గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారని ఆమె తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులతో, కలెక్టర్‌తో మాట్లాడి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందే విధంగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ పర్యటనలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శేఖర్ పాత్రుడు, రాష్ట్ర నాయకులు సుదర్శన్ రావు, వి.రాఘవ, జనసేన కన్వీనర్ శ్రీకర్, కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్ గరా గౌరీ శంకర్రావు ఉన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో మూడో రోజు ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. ఈ శివరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటా సర్వే నిర్వహించి జ్వర పీడితుల నుండి ఇప్పటికే వివరాలు సేకరించారు. ఇంకా ఎటువంటి కేసులు వచ్చిన వెంటనే చూడాలని వైద్య శిబిరాన్ని కొనసాగించాలని వైద్యాధికారినిని ఆదేశించారు. పారిశుధ్యం లోపం కారణంగా అక్కడక్కడ జ్వరాలు వస్తున్నాయని, ఇవి సీజనల్ జ్వరాలు మాత్రమేనని అన్నారు. అనంతరం మండలంలోని బుడ్డిపేటలో జరుగుతున్న ఎన్‌సిడి సర్వేను డిఎంహెచ్ఒ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. అలాగే గుర్తింపు కార్డులను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు పి.రమ్యసాయి, పి.ఉషారాణి, ఇఒ జి.సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మి, హెచ్ఎస్ గోపాలరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్ఒలు ధరణి, హరిప్రియ, ఎఎన్ఎం, లక్ష్మి, ఆశా కార్యకర్తలు కృష్ణవేణి, రమతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


కాలువ నుంచి వృథాగా పోతున్న సాగునీరు

వృథాగా పోతున్న సాగునీరు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని యాలం జంక్షన్ దగ్గర ఇరిగేషన్ కాలువ నుంచి బయటకు నీరు వృథాగా పోతుంది. కాలువ పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో పాటు కాలువలో చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో నీరు బయట పొంగి ప్రవహిస్తుంది. దీంతో రైతు అందాల్సిన సాగు నీరు వృథాగా పోతుండడంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.


రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

బాలగొడబలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని బాలగొడబలో శుక్రవారం బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు, గర్భిణీలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, వారికి కావాల్సిన మందులను అందించారు. అలాగే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేస్తున్న మందులు రోగులకు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున రక్తనమూనాలను సేకరించి పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు.

సంత నర్సిపురం లో ...

వీరఘట్టం : మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శుభారతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇగా నాగభూషణం

ప్రజాశక్తి - సీతంపేట

ట్రైబల్ వెల్ఫేర్ ఎఇఇ కె నాగభూషణంకు ఇంచార్జ్ డిఇగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేట్ ఇంజనీర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు నాగభూషణం శుక్రవారం బాధ్యతలు చేపట్టారన్నారు.


భామిని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ భారీ గొయ్యి

ప్రధాన రహదారిపై భారీ గుంత

ప్రజాశక్తి - భామిని

భామిని గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. చిన్నపాటి వర్షం పడితే ఈ గుంత వర్షంతో నిండి వాహనాల రాకపోకలకు తీవ్రత ఇబ్బందిగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే, ఎవరు ఏ మార్గంలో నడపడానికి అవకాశం లేని పరిస్థితి. ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతను తక్షణమే పూడ్చాలని కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

నిబంధనలు అతిక్రమించి మాదకద్రవ్యాలు అమ్మకాలు చేపడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్విన్పేట సిఐ హరి సూచించారు. గంజాయి స్మోకర్స్, ఐడీ లిక్కర్ మొదలైన మాదకద్రవ్యాల విక్రయాలపై పూతికవలస కూడలి వద్ద ఉన్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం బైక్ మెకానిక్ షాపుల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేని రెండు వాహనాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలను పరిశీలిస్తున్న సిఐ హరి

సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

నియోజకవర్గంలోని మైదాన గిరిజన ప్రాంతాల్లో గల గ్రామాల్లో సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని పెదశాఖ, మసిమండలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.20.90, రూ.21.30 లక్షలతో పదివేల లీటర్ల సామర్థ్యం గల రెండు రక్షిత మంచినీటి పథకాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచినీటి ట్యాంకు వద్ద రిబ్బను కత్తిరించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇంటింటికి మంచినీరందించేందుకు జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కావడంతో ఇప్పటి వరకు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులపై ఆరా తీసి గ్రామాల్లో గల సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గిరిజనులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కేశవరావు, ఎఇ గౌరీశంకర్, పిఆర్ జెఇ ఫణీస్, ఐటిడిఎ ఎఇ గౌరు నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు శానాపతి శేఖర్ పాత్రుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ బి.భానుజీ రావు, కురుపాం ఎఎంసి డైరెక్టర్ నీరస శ్రీనివాసరావు, నాయకులు జి.సుదర్శన్ రావు, మధుసూదన్ రావు, పి వెంకట్ నాయుడు, వి.రాఘవ, జగదీష్, పి.హరిప్రసాద్, బి.తమ్మయ్య, సత్తిబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : సిపిఎం

మండలంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కృషి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొమరాడ మండలంలో పెద్ద శాఖ, మసిమండ పంచాయతీల్లో ఇంటింటికి ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టిలోకి తీసుకువెళ్లాలని కోరారు. మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, గతంలో మంజూరైన రోడ్ల పనులు ప్రారంభించాలని కోరారు. పెద్ద శాఖ, మసిమండ గిరిజన గ్రామాల్లోని గిరిజనులకు పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. పార్వతీపురం నుంచి కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.


బురదమయమైన రోడ్డుపై నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

రోడ్డు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

రహదారి సదుపాయం లేక విద్యార్థులు పాఠశాలకు మట్టి రోడ్డు వెంట 3 కిలోమీటర్ల దూరం నడిసి వెళ్తూ ఇబ్బందులు పడుతున్న సంఘటన మండలంలోని మొండెంఖల్ పంచాయితీ తాబేలుగూడలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక గిరిజన గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి గొర్జిపాడు, మొండెంఖల్ గ్రామాల్లో పాఠశాలలకు విద్యార్థులు, నిత్యవసర సరుకులకు ప్రజలు వెళ్తున్నప్పుడు వర్షాకాలంలో రోడ్డు పూర్తిగా బురదమయమై నడవడానికి వీల్లేకుండా ఉండడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించి విసుగుచెందాం తప్ప రోడ్డు సమస్య పరిష్కరించే నాధుడే కరువయ్యాడని విమర్శిస్తున్నారు. అత్యవసర సమయంలో ఆరోగ్యం బాగు లేకపోయినా 108 కూడా వచ్చే దాఖల్లేవని, డోలి ద్వారా తీసుకెళ్లే పరిస్థితి ఉందని తెలిపారు. కావున ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

శిథిలమైన భవనాల్లో మధ్యాహ్న భోజనాలు

ఏమైనా జరిగితే బాధ్యులెవరు?

ప్రజాశక్తి - వీరఘట్టం

పది కాలాల పాటు ఉండాల్సిన భవనాన్ని గుత్తేదారులు ఇచ్చిన కాసులకు అధికారులు కక్కుర్తి పడడంతో అవి మూడునాళ్లకే మూలకు చేరుతున్నాయి. భవనాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అతి తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందుకు నిదర్శనం గంగంపేట గరుకుల పాఠశాలలో నిర్మించిన భవనమే.

మండలంలోని కత్తుల కవిటి సచివాలయ పరిధిలో గల గంగంపేట గిరిజన గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల రెండు దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న సుమారు 150మంది విద్యార్థులు పాడైపోయిన శిథిలమైన భవనాల్లోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఇప్పటికే ఈ భవనం శ్లాబ్ అక్కడక్కడ పెచ్చులూడి దర్శనమిస్తున్నది. అలాగే పిల్లర్స్ కూడా బీటలు వారుతున్నాయి. వీటికిందనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వంటలు చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట వంట చేసిన వద్ద ప్రదేశంలో స్లేడ్ విరిగి పడిపోవడంతో వంట నిర్వాహకులు భయంతో పరుగులు తీశారు. ఈ పరిస్థితి రాకముందే శిథిలమైన భవనాలు తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించి విద్యార్థులకు ఎటువంటి ప్రాణహాని జరగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిల భవనంలో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న కార్మికులు

దుంప, చిరుధాన్యాల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కొమరాడ

గిరిజనులకు ఉచితంగా ఇచ్చిన దుంప, చిరుధాన్యాల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం రెడ్డి దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని బంజుకుప్ప, బూర్జివలస, చిన ఖేర్జల గ్రామాల్లో గిరిజనులకు సిటిసిఆర్ఐ, బిబిఎస్ఆర్, నవ నిర్మాణ సమితి సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా దుంప, చిరుధాన్యాల విత్తనాలను గిరిజన రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఎంతో అవసరమైన కందమూలం, చీమ పెండలం, సోయా చిక్కుడు, చామదుంప, కంద దుంప విత్తనాలను వందమంది గిరిజన రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. గిరిజన రైతులకు ఎంతో విలువైన దేశీయ విత్తనాలను ఉచితంగా రైతులకు అందజేయడంపై ఆ సమస్యలను నాబార్డ్ డిడిఎం అభినందించారు. ఈ విత్తనాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని పంటలు పండించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ ఆర్వో రేఖ గొనల్, ఆయా స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రకాష్ చంద్రజన, రైతు నేస్తం దాసరి శ్రీధర్, గ్రామ సర్పంచ్ గంగాధర్, సమిత్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని, అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గ్రామంలో జ్వరాలు ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పెద్ద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రమ్య సాయి, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

సూరంపేటలో పారిశుధ్య పనులు

మండలంలోని సూరంపేటలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పూడిక తీతలు, నీళ్ల ట్యాంకర్లు శుభ్రం చేసి, బ్లీచింగ్ జల్లారు. కాలువల్లోని మురుగునీటిని, పిచ్చి మొక్కలను తొలగించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం జరిగిందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం : డిఎస్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పెడతోవ పట్టకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఖైనీ, గుట్కా, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకొని బంగారు భవిష్యత్తుకు యువతే బాటలు వేయాలని ఆకాక్షించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. యువకులు మితిమీరిన వేగంతో వెళ్లరాదని, ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మనరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు పాణిగ్రహి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని నీలకంఠపురం ఎస్ఐ నీలకంఠరావు అన్నారు. స్టేషన్ పరిధిలో గల సంతోషపురంలో గురువారం రాత్రి బస చేసి గిరిజనుల ఆచార సాంప్రదాయాలు, జీవన విధానాన్ని తెలుసుకుని వారితో మమేకమయ్యారు. అనంతరం శుక్రవారం ఉదయం గిరిజనులకు చట్టాలు, మహిళల భద్రత, రోడ్ భద్రత, సైబర్ క్రైమ్, సంకల్పం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజల పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు


అశోక్ గజపతిరాజుకు స్వాగతం పలుకుతున్న గోవా అధికారులు

గోవా గవర్నర్‌గా నేడు అశోక్ ప్రమాణ స్వీకారం

కుటుంబ సభ్యులతో కలిసి పయనం • గోవాలో ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ బంగ్లా దర్బార్ హాల్‌లో ఉదయం 11గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయం గోవాకు పయనమయ్యారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. ఈకార్యక్రమానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహా పలువురు ఎంపిలు హాజరు కానున్నారు. గోవా చేరుకున్న అశోక్ గజపతిరాజుకు అక్కడి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడుతో పాటు గోవా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కాండేవేఇవు, రాష్ట్ర మంత్రి మౌవిన్ గోడింహో, ప్రోటోకాల్ సెక్రటరీ ఎం.గాడ్కర్, డిజిపి అలోక్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రవీణ్ అర్లేకర్, పలువురు గోవా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా పన్ను వసూలు

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక మేజర్ పంచాయతీలో ఇంటిపన్నులు డిమాండ్ రిజిస్టర్ 2025 -26 సంవత్సరానికి ఆన్లైన్‌లో తయారీకి సంబంధించి స్వర్ణ పంచాయతీ వెబ్సైట్‌లో నమోదు చేస్తున్న తీరును డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. మొత్తం 2135 అసెస్మెంట్లు ఉండగా నేటికి ఆన్లైన్‌లో 652 నమోదు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా స్థానిక ఇఒ బెహరా శ్రీనివాసును ఆయన ఆదేశించారు.

మొక్కలు నాటిన హెచ్ఎం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆ పాఠశాల హెచ్ఎం నాగభూషణం, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాసరావు కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో బౌరోత శంకరరావు, రమేష్ బాబు, నారాయణరావు, బాబురావు, సూర్య ప్రసాద్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల ఉపాధ్యాయ బదిలీల్లో మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల చావిడి వలస నుంచి దాసు గుమ్మడ బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు శీలా గణేష్‌ను ఎంఇఒలు ఎం.ఆనందరావు, డి.సూర్యచంద్రరావు, చావిడివలస పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు గేదెల జనార్దన్‌రావు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాలక కృష్ణారావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో 39మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను ప్రస్తుతం 76మందికి చేరిందని, దీనివల్ల ప్రస్తుతం ఐదుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించడం జరిగిందని అన్నారు. మండలంలోని చావిడవలస పాఠశాల మోడల్ పాఠశాలగా ఎంపిక కావడానికి గణేష్ మాస్టర్ కృషి ఎంతో ఉందని సర్పంచ్ ప్రతిక వీరన్న, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎల్లంగు, లింగన్న కొనియాడారు. పాఠశాలను అభివృద్ధి చేయడంలో పాటు పరిసరాలు అభివృద్ధి, బడితోట, పాఠశాల విద్యార్థుల్లో క్రమశిక్షణ బాగా పెరిగిందని జనసేన నాయకులు మండంగి అరుణ్ కుమార్ తెలిపారు. హడ్డుబంగి, మర్రిపాడు, లాడ గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండంగి ప్రసాదరావు, జయప్రకాష్, దుర్గారావు, ఉపాధ్యాయులు సాయి ప్రసాద్, యమున, బాలకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలో పెదగైశీలలో బదిలీపై వెళ్లిన పాలవలస శ్రీనివాసరావు, ఎస్‌వెంకటరమణ ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు వేంపడాపు శ్రీనివాస్ రావు, టిడిపి నాయకులు వి.స్వామి నాయుడు, శ్రీహరి నాయుడు తదితరులు పాల్గొన్నారు


ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, నాయకులు

స్కూల్ బస్సుల్లో మెడికల్ కిట్లు తప్పనిసరి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పాఠశాలలకు విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు, ఆటోలకు తప్పనిసరిగా అన్ని రకాలైన వసతులు ఉండేలా పాఠశాల యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మామిడిపల్లి జంక్షన్ వద్ద మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావుతో కలిసి స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాల బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, బస్సులలో ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు యూనిఫాం ధరించనందుకు, స్కూల్ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేనందుకు మూడు బస్సులకు రూ.1800 చొప్పున జరిమానా విధించారు. రోడ్లపై డ్రైవర్లు ప్రయాణించేటప్పుడు సురక్షితంగా విద్యార్థులను పాఠశాల నుంచి వారి వారి ఇళ్లకు చేర్చే విధంగా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు, మోటారు వెహికల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

కోడి పందేల రాయుళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

కోడిపందాలరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. మండలంలోని తామరకండి శివారులో శుక్రవారం కోడిపందాలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు రూ.17,300 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


ప్రజాశక్తి
గోవా రాష్ట్ర గవర్నర్
పూసపాటి అశోక్ గజపతిరాజు
ప్రమాణస్వీకారోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
శనివారం 26-7-2025 | విజయనగరం జిల్లా | 4 పేజీలు


ఎమ్మెల్యే నుంచి గవర్నర్ వరకు

- గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు నేడు ప్రమాణ స్వీకారం
- టిడిపి పూర్వ సీనియర్ నేతకు తగిన గుర్తింపు

టిడిపి పూర్వ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. శనివారం ఉదయం 11గంటలకు గోవా గవర్నర్ బంగ్లాలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లానుంచి పలువురు టిడిపి నాయకులు, అశోక్ కుటుంబ సభ్యులు ఇప్పటికే గోవా తరలివెళ్లారు. గోవా ఎయిర్‌పోర్టులో ఆయనకు అక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం మహరాజు పివిజి రాజు కుమారుడైన అశోక్‌జగజపతిరాజు 1951 జూన్ 26న జన్మించారు. గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్‌పబ్లిక్ స్కూలులో, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో చదువుకున్నారు. తన తండ్రి పివిజి రాజు వారసత్వంతో 1978లో మొట్టమొదటిసారిగా జనతా పార్టీలో చేరి విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తరువాత 1982లో ఎన్‌టిఆర్ హయాంలో (మిగతా.. 2లో)



ఆధునిక రాజకీయాల్లో ఆడంబరాలకు దూరంగా ఉండడం, హంగూ ఆర్భాటాలు లేకుండా సాధారణంగా ఉండడంలో ఆయనకు ఆయనే సాటి. నిరాడంబరంగా జీవితం గడిపే నాయకుల్లో అశోక్‌గజపతిరాజు ఒకరు. విజయనగరం సంస్థానాదిశ కుటుంబ వారసులుగా, నిరాడంబర రాజకీయ నేతగా రాజకీయాల్లో ఆయనకు గుర్తింపు ఉంది. సాక్ష్యాత్తు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మన ప్రాంత పార్లమెంటు సభ్యుల ద్వారా అశోక్‌గజపతిరాజు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారంటే జాతీయ స్థాయిలో అశోక్‌కు గల గుర్తింపును తెలియజేస్తుంది. సంస్థానాధీసుల కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు భారత రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం కొట్టి పారేయలేనిది. చట్టాలను గౌరవించడం, న్యాయ ధర్మాలను ఆచరించడం ప్రతి ఒక్కరూ తమ విధిగా భావించాలంటారు ఆయన. ప్రజా స్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారుగా ఉండాలంటారు అశోక్‌గజపతిరాజు.


సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సాధారణ ప్రయాణికుడిలా రైలు కోసం ఎదురుచూస్తున్న అశోక్ గజపతిరాజు

ఆయనకు ఆయనే సాటి

ప్రజాశక్తి - విజయనగరంకోట

అశోక్‌గజపతిరాజు తండ్రి డాక్టర్ పివిజి రాజు ఆనాటి ఆంధ్ర ప్రాంతంలో అత్యంత ప్రజాదరణ పొందిన రాజవంశీకులు. సోషలిస్ట్ భావాలు కలిగిన ఆయన నాటి దేశ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. పివిజి రాజు సోషలిస్టు ఆలోచనలు పునికి పుచ్చుకున్న ప్రజాస్వామ్యవాది. పివిజి రాజు రాష్ట్రమంత్రిగా, ఎంపిగా పనిచేశారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కోరుకొండ సైనిక పాఠశాల ఏర్పాటుకు ఎంతో విలువైన వందలాది ఎకరాల భూమిని ప్రభుత్వానికి దానం చేశారు. పలు దేవాయాలు నిర్మించారు. విద్యాభివృద్ధికి గానూ మహారాజా సంగీత కళాశాల, సంస్కృత కాలేజీ ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రస్తుతం ఎవివిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, న్యాయ కళాశాల, పాలిటిక్నిక్ కళాశాల వంటి అనేక విద్యా సంస్థలు ఏర్పాటు చేసి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఈ విద్యా సంస్థలో విద్యన్యసభించిన వారు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. విజయనగరం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాణి అప్పలకొండమాంబ పేరిట తాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని మహారాజా ఆసుపత్రి ప్రత్యేకించి మహిళల ప్రసవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక ఘోషాసుపత్రిని నిర్మించి మహిళలకు అందుబాటులో ఉంచారు. అంతటి దానగుణం గల కుటుంబం నుంచి వచ్చిన ఆనంద గజపతిరాజు, అశోక్‌గజపతిరాజు. ఆనంద గజపతిరాజు ఎంపిగానూ, రాష్ట్ర విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. ఆయన తండ్రి స్థాపించిన మాన్సాస్ సంస్థకు అధ్యక్షులుగా ఉంటూ తన తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేశారు. ప్రస్తుతం అశోక్‌గజపతిరాజు మాన్సాస్ చైర్మన్‌గా పలు దేవాలయాలకు అనుశంశిక ధర్మకర్తగా సేవలందిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విభజన చట్టం మేకు కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఒక విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతి మేరకు అశోక్‌గజపతిరాజు ఆ విమానాశ్రయాన్ని మన జిల్లాలోని భోగాపురంలో ఏర్పాటుకు పూనుకున్నారు. ఎన్టీయార్ నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గాల్లో సుదీర్ఘ కాలం అనేక శాఖలు నిర్వహించిన అశోక్‌గజపతిరాజు జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. వారి హయాంలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం, జిల్లా సర్వజన ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు విద్యా సంస్థలు ఏర్పాటు, వాటి భవన నిర్మాణాలు జరిగాయి. అంతకుముందు అశోక్‌గజపతిరాజు భార్య సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పట్టణ అభివృద్ధికి కృషి చేశారు. నిత్యం పలు వాహనాలతో రద్దీగా గల పట్టణంలోని ఎత్తుబ్రిడ్జి వద్ద ఏర్పాటైన సంతకాల బ్రిడ్జిలో అశోక్‌ది ఒక సంతకంగా చెప్పుకోవచ్చు. ప్రతి ఎన్నికల్లోనూ విజయనగరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన అశోక్ 2024లో ఆయన కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజును పోటీలో నిలిపి విజయానికి కృషి చేశారు. జిల్లాలో టిడిపికి దశాదిశా నిర్దేశించే అశోక్‌గజపతిరాజు పట్ల పార్టీశ్రేణుల్లోనూ, నేతల్లోనూ గౌరవం తరగతనిది. అటువంటి ప్రజా నాయకుడు నేడు గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ప్రధాని మోడీతో కరచాలనం చేస్తున్న అశోక్ గజపతిరాజు, చిత్రంలో సిఎం చంద్రబాబు (ఫైల్)

మంచికి మరో రూపం



మంచికి, మానవత్వానికి మరో రూపం అశోక్‌గజపతిరాజు. ఆయనకు గవర్నర్ పదవి రావడం అంటే జిల్లా వాసుల అందరి ఇంట్లో పదవి వచ్చినంత ఆనందంగా ప్రజలు ఉన్నారు. జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి ఎనలేనిది. తాగునీటి సౌకర్యం, రోడ్ల విస్తరణ, గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పరచడం ఆయనకే సాధ్యం. ఆయన ఎందరో నాయకులకు ఆదర్శనీయులు. ఆయన బాటలోనే నడుస్తాం.

- వేచలపు శ్రీనివాసరావు, రాకోడు ఎంపిటిసి సభ్యులు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అరుదైన రాజకీయ నాయకుడు



రాష్ట్రంలోనే అరుదైన నాయకుడు అశోక్‌గజపతిరాజు. ఆయన విలువలతో కూడిన రాజకీయాలు నెరిపారు. కుట్రలు, కుతంత్రాలు ఆయనకు తెలియవు. పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఎంతోమందికి ఆయన ఆదర్శనీయులుగా నిలిచారు. నిస్వార్థ రాజకీయవేత్త ఆయన మాన్సాస్ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాం.

- కొసర శివ, టిడిపి నాయకులు, మలిచర్ల

నీతి, నిబద్ధతకు దక్కిన ఫలితం



కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు నీతి నిజాయితీ నిబద్ధతకు దక్కిన గౌరవం గోవా గవర్నర్ పదవి. దేశం, తెలుగు జాతి పట్ల ఆయనకు ఎనలేని అభిమానం. సేవా గుణం గల పూసపాటి కుటుంబం నుంచి వచ్చిన ఆయన మాన్సాస్ ట్రస్టు ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయన బాటలోనే ఆయన కుమార్తె ఎమ్మెల్యే అదితి విజయలలక్ష్మి కూడా నడుస్తున్నారు. ఆయనకు గవర్నర్ పదవి రావడం అభినందనీయం.

- తుమ్మగంటి రామారావు, టిడిపి నాయకులు, మలిచర్ల

అశోక్ అంటేనే ప్రత్యేక గుర్తింపు



అశోక్ గజపతి రాజు అంటేనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న వ్యక్తి. ఆనాడు పార్లమెంట్‌లో బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు వరించింది అంటే అతను నిబద్ధత విలువలకు నిదర్శనం. తన రాజకీయ జీవితంలో చేసిన ఎన్నో సేవలకు, అభివృద్ధికి గుర్తింపుగా గవర్నర్ పదవి వచ్చింది. ఆయన ఏనాడూ పదవులను ఆశించలేదు. పదవులే ఆయనను వరించాయి.

- కనకల రాంబాబు, టిడిపి నాయకులు, పినవేమలి

ఎమ్మెల్యే నుంచి గవర్నర్ వరకు..


గవర్నర్‌గా ప్రమాణ స్వీకారానికి కుటుంబసభ్యులతో కలిసి గోవా వెళ్తున్న అశోక్

(మొదటి పేజీ తరువాయి)

టిడిపిలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు 1983, 1985, 1989, 1994, 1999, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో ఎక్సైజ్, వాణిజ్య, ఆర్థిక, రెవెన్యూ, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రిగా పనిచేశారు. 2014లో విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌర విమానయాన శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరు విషయంలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీపొలిట్ బ్యూరో సభ్యుడిగా, సిఎం చంద్రబాబుకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. అశోక్ సతీమణి సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ చైర్మన్‌గా సేవలందించారు. అశోక్‌గజపతిరాజుకు అదితి విజయలక్ష్మి, విద్యా గజపతిరాజు కుమార్తెలు. 2024 ఎన్నికల్లో కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

బయోడేటా

పేరు	:పూసపాటి అశోక్‌జగపతిరాజు
పుట్టిన తేదీ	:26-06-1951
తండ్రి	:డాక్టర్ పివిజి రాజు
తల్లి	: కుసుమ గజపతి
భార్య	: సునీలా గజపతి
పిల్లలు	: అదితి గజపతి, విద్యావతిదేవి
విద్యాభ్యాసం	:గ్వాలియర్‌లో సింధియా స్కూల్, హైదరాబాద్‌లో పబ్లిక్ స్కూల్, విశాఖలో విఎస్ కృష్ణా కాలేజీ.
రాజకీయం	: 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 1982లో టిడిపి ఆవిర్భావం నుంచి అందులోనే కొనసాగారు.

చేపట్టిన పదవులు : 1983, 1985, 1989, 1994, 1999, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి ఎంపిగా విజయం సాధించారు. రాష్ట్ర వాణిజ్య పన్నులు, అబ్కారీ, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ, ఆర్థికశాఖమంత్రిగానూ, కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు.

పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు



విలువలు, నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్న వ్యక్తి అశోక్‌గజపతిరాజు. పార్టీలో ఎదిగి, ఒదిగిన ఏకైక నేత. 1982 మార్చి 29న పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చేరి ఎన్‌టిఆర్ విధేయుడిగా, అభిమానస్తుడిగా, నమ్మకస్తుడిగా ఒక కుడి భుజంగా ఉంటూ వచ్చారు. చంద్రబాబు నాయుడు, అశోక్ గజపతిరాజు ఇరువురి రాజకీయ స్నేహం నేటికీ పదిలంగా ఉందంటే ఒకే మాట ఒకే బాటపై ఉండడమే. ఆ ఒరవడే నేడు అశోక్ గజపతి రాజును ఈ స్థాయికి తీసుకొచ్చింది. పార్టీ పదవులను ఎప్పుడూ ఆయన పట్టుకు వేలాడలేదు, పదవులే ఆయనను వరిస్తూ వస్తున్నాయి. ఈనాడు రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవి ఆయనకు వచ్చిందంటే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అశోక్ గజపతిరాజుపైన ఉన్న విశ్వాసమే కారణం.

- ఐవిపి రాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి

అశోకుని హయాంలో ద్వారపూడి అభివృద్ధి

ప్రజాశక్తి - విజయనగరంకోట

ద్వారపూడి గ్రామ అభివృద్ధిలో అశోక్‌గజపతి రాజు ముద్ర ఉంది. కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ద్వారపూడి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అక్షరాస్యతను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా చిట్టిగురువులు కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఇది విజయ వంతమై దేశంలోనే గుర్తింపునకు తీసుకొచ్చి ద్వారపూడి గ్రామ ప్రతిష్టను పెంచింది. గ్రామంలో మరుగుదొడ్లు లేక రోడ్లపైనే మలవిసర్జన చేసేవారు. ఆయన కృషితో గ్రామంలో వివిధ ప్రదేశాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు.. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు కాలువల్లో గొట్టాలు ఉంటే ఇంజినీరింగ్ అధికారులను పిలిపించి కాలువల్లో కాకుండా తాగునీరు గొట్టాలను పునర్మించారు. డిజిటల్ చెల్లింపులు కూడా ఈ గ్రామం నుంచి అలవాటు చేశారు. గ్రామంలో సోలార్ ప్యానల్‌ను నిర్మించి వీధిలైట్లకు సోలార్ కాంతులతో వెలుగునిచ్చారు. విజయనగరం నగర పాలక సంస్థలకు రూ.5కోట్లు వ్యయంతో సోలార్ ప్లాంట్లను నిర్మించి విద్యుత్ భారాన్ని తగ్గించారు. అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పాఠశాలల్లో ఆటవస్తువులతో పాటు మౌలిక వసతులు కల్పించారు. గ్రామంలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు.

మా నాన్నే నా రాజకీయ గురువు

- గవర్నర్ పదవి రావడం ఎంతో సంతోషంగా ఉంది
- 50 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి
- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు



ప్రజాశక్తి-విజయనగరంకోట

మా నాన్నే నా రాజకీయ గురువు అని విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆయన కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ తన తండ్రి 50ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషి అని అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గవర్నర్ పదవిని కట్టబెట్టారని, వారి అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు తండ్రి అశోక్‌గజపతిరాజు అందించిన సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నానని, ఇక పైన రాజకీయపరమైన సలహాలు ఉండవని బాధ అయితే తనలో ఉందని అన్నారు. తండ్రిగా తమను ఒక ఆడపిల్ల లాగానే పెంచి పెద్ద చేసి ఉన్నతమైన విలువలు నేర్పి ఈరోజు ఈ స్థితికి తీసుకువచ్చారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ , ఆయన విలువలు, నిబంధనలు, క్రమశిక్షణ అలవర్చుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. తండ్రి అశోక్ రాజకీయ జీవితంలో సమాజం పట్ల, అభివృద్ధి పట్ల ఏ విధంగా అయితే ముందుకు వెళ్లారో అదేవిధంగా తాను కూడా వెళ్తానని చెప్పారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రం, దేశం గర్వపడే విధంగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగు తుందన్నారు. జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

పదవులకే వన్నెతెచ్చిన నాయకుడు అశోక్

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున



పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు అశోక్‌గజపతిరాజు అని టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో..

సాధారణంగా రాజకీయాల్లో ఉన్నవారు పదవులను కోరు కుంటారు. అది మానవ సహజం. అయితే ఆ పదవుల ద్వారా కొందరు మంచి చేయాలనుకుంటారు. మరికొందరు స్వప్రయోజనాలకు వాడుకుంటారు. కానీ మంచికి వాడే మహా మనిషి అశోక్ గజపతిరాజు. పదవులే ఆయన్ని కోరుకుంటాయి. ఎందుకంటే ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా హుందాగా వ్యవహరిస్తూ ఆ వ్యవస్థలను సరియైన గాడిలో పెట్టి పయనింప చేయడం ఆయన సహజ గుణం. అందుకే ఆయన ముందు గవర్నర్ పదవి చిన్నదే అనిపిస్తుంది. ఆయన 1978లో మొట్టమొదట ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఆయన జిల్లాను అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిగా ఆ రంగంలో విశేషమైన మార్పులు తీసుకొచ్చి, ప్రయాణాన్ని సులభతరం చేశారు. భోగాపురంలో ఆయన తీసుకొచ్చిన అంతర్జాతీయ విమానాశ్రయంతో విజయనగరం ఖ్యాతి దేశవ్యాప్తంగా వినిపించ బోతుందంటే ఆయన కృషి ఫలితమే. నేడు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న అశోక్ గజపతిరాజుకు ప్రత్యేక అభినందనలు.

నిత్య కృషీ వలుడు అశోక్‌గజపతిరాజు



సమాజ సేవలో నిత్య కృషీవలుడు మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు. తన రాజకీయ జీవితంలో సమాజ అభ్యున్నతికి రాజకీయ పురోగతికి నిరంతరం కృషి చేశారు. తన శక్తి మేరకు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ఖచ్చితమైన పరిపాలన ప్లానింగ్ చేసుకుని ముందుకు వెళ్లే నాయకుల్లో ఆయన ప్రథముడు. అశోక్ గజపతిరాజు అంటేనే ఒక మార్గదర్శి. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు బడి ఈడి పిల్లల కోసం తీసుకువచ్చిన చిట్టి గురువులు కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. చిన్నారుల చదువుకు ఎంత ఉపయోగపడింది అంటే అది అతిశయోక్తి కాదు. ఈ కార్యక్రమాన్ని దేశ ప్రధానమంత్రి రాష్ట్రపతి సైతం జై కొట్టారంటే ఆయన భవిష్యత్ తరాల కోసం ఎంత ఆలోచిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఆ ఆలోచనతోనే విజయనగరంలో నీటి కొరత లేకుండా చేసిన మహనీయుడు. సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీకి విద్యుత్ తీసుకు వచ్చిన ఘనుడు. ఇటువంటి ఆలోచనలతో ఆయన ఎప్పుడూ భవిష్యత్ తరాల కోసం ముందు వరుసలో ఉంటారు. ఆయన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో సేవలు అభినందనీయం.

- ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు, విజయనగరం


పార్టీ సేవకు అరుదైన గుర్తింపు



సమాజం, పార్టీ సేవకు అరుదైన గుర్తింపు అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి. ఆయన కోసం ఎంత చెప్పినా తక్కువే. తన 47ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలోనైనా, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోనైనా విలువలు గల నాయకుడు. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు అవినీతి మరక లేకుండా మకుటం లేని మహారాజుగా వెలుగొందారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి వన్నెతెస్తుంది. రాజ్యాంగ బద్ధమైన గవర్నర్ పదవికి ఆయన అన్ని విధాలా అర్హులు. ఆనాడు జిఎంసి బాలయోగిని గవర్నర్ గా నియమించడం, ఇప్పుడు అశోక్ గజపతిరాజును నియమించడం చంద్రబాబు నియమ నిబంధనలకు ఇంతకంటే గుర్తింపు ఏముంటుంది.

- గంటా పోలినాయుడు,
టిడిపి మండల కార్యదర్శి ,విజయనగరం


గురుతర బాధ్యత కలిగిన నాయకుడు



ఒక గురుతర బాధ్యత కలిగిన నాయకుడు కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు. ఇటు జిల్లా రాజకీయాల్లోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో గురువు పాత్ర పోషిస్తూ సలహాలు సూచనలు ఇస్తూ పార్టీ ఎదుగుదలలో నిత్య మార్గదర్శకులు. జిల్లా లో పార్టీని ఒక తాటిపై నడిపించడం ఆయనకు మాత్రమే సొంతం. సహృదయం గలవారు. ఏ సమస్య అయినా ముందే పసిగట్ట గల రాజకీయ విజ్ఞతుడు. సమయపాలనలో తనకు తానే సాటి. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు అశోక్ గజపతిరాజు. తాను అందించిన సలహాలు సూచనలు పాటిస్తూ నేడు రాజకీయాల్లో ఆయన చూపించిన మార్గంలోనే మేము ముందుకు వెళ్తున్నాం. ఇటువంటి మహనీయులను అరుదుగా చూస్తాం. నిరంతరం ప్రకృతిని ఆస్వాదించే ప్రకృతి ప్రేమికుడు. భవిష్యత్ తరాలకు మార్గదర్శి మన కషివలుడు అశోక్ గజపతిరాజు.

-పాశి అప్పలనాయుడు,
టిడిపి సీనియర్ నాయకులు, బడుకొండపేట

ఆయన అజాత శత్రువు



అశోక్‌గజపతిరాజు నీతి, నిజాయితీ, హుందాతనానికి పార్టీ ఇచ్చిన గౌరవం గవర్నర్ పదవి. అశోక్ గజపతిరాజు అంటే ఒక అజాతశత్రువు. పార్టీ ఆయనకు అందించిన గౌరవం. తన 47 ఏళ్ళ రాజకీయ జీవితం ఎందరికో ఆదర్శం అన్నారు. 1978లో మొదలైన తన రాజకీయ జీవితం 2004, 2019లో వాటిని తప్ప మరెక్కడా ఓటమి లేదు. ఎన్‌టిఆర్, చంద్రబాబునాయుడు ప్రభుత్వాల్లో ఎన్నో మంత్రి పదవులు చేపట్టారు. కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు గవర్నర్ పదవి రావడం జిల్లాతో పాటు యావత్ రాష్ట్రం గర్విస్తుంది. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు, గోవాలో మోపా ఎయిర్ పోర్ట్ శంకుస్థాపన చేశారు. ఆయన సూచనలు, సలహాలు సర్వదా ఆచరణీయం.

- పి.రాజేష్‌బాబు,
ఎంపిటిసి సభ్యులు, జొన్నవలస


సరిలేరు మీకెవ్వరూ..



విలువలు, సమయపాలన అమలులో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుకు రాష్ట్రంలోను, జిల్లాలోనూ ఎవరూ సరిలేరు. సమాజ సేవలోను, రాజకీయ సేవలోను ఆయనకు మించిన నాయకుడు మరెవరూ ఉండరు. ఆయన తల్లిదండ్రులు, తాతలు చేసిన విద్యాదానాలు మరువలేనివి. మహారాజా విద్యాసంస్థలలో చదువుకొని నేడు కొన్ని లక్షల మంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడి ఉన్నారంటే ఆ విద్యాసంస్థల గొప్పదనం ఏ పాటిదో అర్థమవుతుంది. ఒక అంధ విద్యార్థి కోసం సంగీత కళాశాలనే ఏర్పాటు చేసిన మహానీయులు. అశోక్ గజపతిరాజు కోసం ఎంత చెప్పుకున్న తక్కువే.

- బొబ్బాది ఈశ్వరరావు , సారిక గ్రామసర్పంచ్

విజ్ఞత కలిగిన నాయకుడు



మంచి విజ్ఞత కలిగిన నాయకుడు అశోక్‌గజపతిరాజు. నిర్ణయాలను కచ్చితంగా అమలు చేస్తారు. ఎటువంటి సందర్భాల్లోనైనా నాయకులకు, ప్రజలకు, సమాజానికి మంచి ఆలోచనలతో సరియైన దిశా నిర్ధేశం చేస్తారు. తన నిర్ణయాలతో సమాజాన్ని అభివృద్ధిలో తీసుకురావడానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి. తన సలహాలు, సూచనలతో జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని కూడా తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని పొందారు. ఎందరో నాయకులు ఆయన సలహాలు ఆచరించి ఎంతో ఎత్తుకు ఎదిగారు. నేడు ఆయన గోవా గవర్నర్‌గా నియమితులు కావడం ఎంతయినా గర్వకారణం. ఇన్నాళ్ళ సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన ఏనాడూ మాట పడని వ్యక్తి అశోక్ గజపతిరాజు.

- చొప్ప రామారావు, టిడిపి నాయకులు, కోరుకొండపాలెం


మంచికి మారుపేరు



నీతి, నిజాయితీకి, మంచికి మారుపేరుగా నిలిచిన వ్యక్తి పూసపాటి అశోక్ గజపతిరాజు. టిడిపి ఆవిర్భావం నుంచి జిల్లాలో పార్టీని నేడు ఈ స్థాయికి అభివృద్ధి చేశారంటూ ఆయన కృషే. పార్టీని ఒకతాటిపై నడిపిస్తూ కంచుకోటగా మార్చారు. స్వార్థం ఎరుగని నాయకుడు. విలువలకు నిలువుటద్దంగా నిలిచారు. అవినీతి లేని పాలన చేసి చూపిన నాయకుడు. నాయన నుంచి ఎన్నో విషయాలు నేటి రాజకీయ నాయకులు నేర్చుకోవాలి. అందరికీ ఆదర్శప్రాయులు ఆయన.

- పడగల రామకృష్ణ, టిడిపి నాయకులు, బియ్యాలపేట


కోహినూర్ వజ్రం లాంటి వ్యక్తి



మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ ప్రపంచంలో కోహినూర్ వజ్రం లాంటి వారు. ప్రపంచంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులలో ఆయన ఒకరు. ఎంతోమందికి రాజకీయ మార్గదర్శకుడు. ఆయన బాటలోనే మేమంతా నడుస్తున్నాం. అటువంటి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి మాకు మార్గదర్శకులుగా ఉండడం ఎన్నటికీ మర్చిపోలేని విషయం. క్రమశిక్షణకు మారుపేరు అశోక్ గజపతిరాజు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చేపట్టి ఉన్నత శిఖరాలకు ఎదిగారు.తాజాగా గవర్నర్‌గా నియమితులు కావడం అభినందనీయం.

- బొద్దల నర్సింగరావు,
టిడిపి మండల అధ్యక్షులు

నిస్వార్థపరులు అశోక్‌గజపతిరాజు



ప్రజల కోసం, జిల్లా అభివృద్ధి కోసం తన 47 ఏళ్ళ రాజకీయ జీవితంలో నిస్వార్థంగా సేవ చేసిన నాయకులు అశోక్‌గజపతిరాజు. 1978 సంవత్సరంలో జనతా పార్టీ తరపున పోటీ చేసి గెలిచారు. తరువాత అన్న నందమూరి తారక రామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీలో చేరి నాటి నుంచి నేటి వరకు రాష్ట్రానికి, దేశానికి తన సేవలందించారు. ఆయన ఏనాడూ పదవులు కోరుకోలేదు. అలా అని వచ్చిన పదవులను తిరస్కరించకుండా ఆ పదవులకు వన్నె తెచ్చే విధంగా, ఒక కిరీటంగా ఉంటూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన నేడు గోవా గవర్నర్‌గా నియమితుల కావడం పట్ల జిల్లా వాసులు, రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

- కంది సాయి జగ్గారావు
మాజీ ఎంపిపి, విజయనగరం

ముందుచూపు ఉన్న నేత అశోక్



కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సమాజాన్ని ముందుచూపుతో చూసి నడిపిన నాయకుడు. రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో ఏ పదవి ఆయనకు ఇచ్చినా నూరుశాతం న్యాయం చేస్తారు. ఏ పదవికైనా ఆయన అర్హుడు. జిల్లా, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. మాలాంటి నాయకులెందరికో ఆయన ఆదర్శనీయులు.ఆయన అడుగుజాడల్లో నడుస్తాం.


- సుంకరి పైడిరాజు,
టిడిపి నాయకులు, సుంకరిపేట


గ్రామ అభివృద్ధిలో ముఖ్య భూమిక వహించారు




మా ద్వారపూడి గ్రామ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించిన మహనీయుడు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు. నియోజకవర్గంలో మా గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి పవర్ ఆదా చేయడానికి ఎంతో కృషి చేశారు. దానిని గత ప్రభుత్వం ధ్వంసం చేయడం బాధాకరమైన విషయం. ఆయన నీతి నిజాయితీకి నిలువుటద్దం. క్రమ శిక్షణకు మారుపేరు. నిబద్ధత కలిగిన వ్యక్తి.


- వెన్ను శ్రీనివాసరావు,
ఉప సర్పంచ్, ద్వారపూడి


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
సుంకరి ఉమాదేవి
మాజీ ఎంపిటిసి
సుంకరిపేట, మలిచర్ల
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
సుంకరి రామునాయుడు, సన్యాసమ్మ
మాజీ సర్పంచ్, సుంకరిపేట, మలిచర్ల
గోవా రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు
సుంకరి పైడిరాజు
టిడిపి కార్యవర్గ సభ్యులు,
సుంకరిపేట పంచాయితీ


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
గోవా రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు
కంది సాయి జగ్గారావు
మాజీ ఎంపిపి, విజయనగరం,
గుండాలపేట


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
ఐ.వి.పి.రాజు
టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి,
విజయనగరం



ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
కొసర శివ
టిడిపి మలిచర్ల గ్రామ ఉపాధ్యక్షులు,
విజయనగరం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక
శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
వెన్ను శ్రీనివాసరావు
మాజీ సర్పంచ్, ద్వారపూడి,
విజయనగరం మండలం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
చొప్ప రామారావు S/o సత్యం
కోరుకొండ పాలెం, విజయనగరం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
తుమ్మగంటి రామారావు
టిడిపి మలిచర్ల గ్రామ అధ్యక్షులు, విజయనగరం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక హార్థిక శుభాకాంక్షలు
పడగల రామకృష్ణ
తెలుగుదేశం పార్టీ నాయకులు,
విజయనగరం
శ్రీమతి పడగల అబద్ధం
సర్పంచ్, బియ్యాలపేట,
విజయనగరం మండలం
తాడ్డి శ్రీరాములు
పార్టీ ప్రెసిడెంట్
నారంశెట్టి ఈశ్వరరావు
వైస్ సర్పంచ్
చిన్ని రమణమ్మ
4 వార్డు మెంబర్
అల్లబోయిన రాంబాబు
5 వార్డు మెంబర్
ముద్దాడ కళ్యాణి
8 వార్డు మెంబర్
నారంశెట్టి శ్రీను
స్కూల్ వైస్ చైర్మన్
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక
శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
కనకల రాంబాబు
టిడిపి నాయకులు, పినవేమలి,
విజయనగరం మండలం


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
గోవా రాష్ట్ర గవర్నర్‌గా
ప్రమాణ స్వీకారం చేయునున్న
గౌ॥ శ్రీ పూసపాటి
అశోక్ గజపతిరాజు గారికి
మా హృదయపూర్వక
హార్థిక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు
గవర్నర్, గోవా రాష్ట్రం
వేచలాపు శ్రీనివాసరావు
ఎంపిటిసి, రాకోడు,
విజయనగరం మండలం